నమస్తే తెలంగాణ
నిపుణ
Guide to Excellence
www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna

**నందిని దాస్**

భారత సంతతికి చెందిన రచయిత్రి నందిని దాస్ ప్రతిష్ఠాత్మక బ్రిటిష్ అకాడమీ బుక్ ప్రైజ్-2023కు ఎంపికయ్యారు. యూనివర్సిటీ ఆఫ్ ఆక్స్‌ఫర్డ్‌లో ఇంగ్లిష్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆమె రచించిన 'కౌంటింగ్ ఇండియా: ఇంగ్లండ్, మొఘల్ ఇండియా అండ్ ఆరిజన్స్ ఆఫ్ అంపైర్'కు ఈ ప్రైజ్ లభించింది. లండన్‌లోని బ్రిటిష్ అకాడమీలో అక్టోబర్ 31న జరిగిన కార్యక్రమంలో ఆమెకు ఈ బహుమతిని అందజేశారు.

nipuna
Every Wednesday Free Supplement
03.
29 నవంబర్ 2023
పేజీలు 8

# మేలైన పన్నుల విధానం.. వన్నె తెచ్చిన వాస్తు శిల్పం




గత వారం తరువాయి

## ఆర్థిక వ్యవస్థ

- వ్యవసాయం ప్రజల ముఖ్యవృత్తి. వ్యసాయంలో, పరిశ్రమల్లో బానిసలను నియమించారు.
- ప్రభుత్వం పంట ఉత్పత్తిలో 6వ వంతు లేదా 8వ వంతు లేదా 4వ వంతు వసూలు చేసేది. భాగ, బలితోపాటు శుల్క, కరి మొదలైన పన్నులను గంగా-మైదానం ప్రాంతంలో విధించారు.
- ప్రభుత్వం సాగు చేసే క్షేత్రాలను సీత క్షేత్రాలనేవారు. వీటిని పర్యవేక్షించే అధికారిని సీతాధ్యక్ష అనేవారు.
- అరణ్యభూములను, బంజర భూములను రాజు సేద్యంలోకి తీసుకురావాలని అర్థశాస్త్రం చెబుతుంది.
- ఏనుగులున్న అరణ్యాలను నరకటంపై నిషేధం ఉండేది. ఏనుగును చంపినవారికి మరణశిక్ష పడేది. ఇందుకు కారణం సైన్యానికి రవాణాకు వంతెన నిర్మాణానికి ఏనుగులు అవసరం కావడం.
- ప్రభుత్వ ఆదాయంలో ఎక్కువ భాగం సైన్య నిర్వహణకు, యుద్ధ అశ్వాలకు, ఏనుగులు, రథాల నిర్మాణం కోసం ఖర్చు అయ్యేది.
- భారతదేశంలో పన్నుల విధానం రూపొందించడంలో మౌర్య సామ్రాజ్యం ఒక ప్రధానమైన మలుపు. రైతుల వద్ద నుంచి, చేతి వృత్తుల వారి నుంచి, వ్యాపారుల నుంచి వసూలు చేయవలసిన పన్నుల పేర్లను కౌటిల్యుడు అర్థశాస్త్రంలో పేర్కొన్నాడు.
- మౌర్యులు వసూలు చేసిన పన్ను ధనాన్ని భద్రపరచడం కంటే పన్నులు నిర్ణయించడానికే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. పన్నులు నిర్ణయించే అత్యున్నతాధికారి సమాహర్త. పన్ను ధనాన్ని ఖజానాలో భద్రపరిచే అధికారి సన్నిధాత.
- రాజ్యానికి మొదటి అధికారి అయిన సమాహర్త చేసే అపకారం, రెండవ అధికారి అయిన సన్నిధాత చేసే అపకారం కంటే ఎక్కువగా ఉంటుందని భావించారు.
- పన్నులు నిర్ణయించే పెద్ద అధికార యంత్రాంగం మొదటిసారిగా మనకు మౌర్యుల కాలంలోనే కనిపిస్తుంది. మౌర్యుల కాలంలో గ్రామాల్లో గిడ్డంగులు ఉన్నట్లుగా శాసనాధారాలు తెలుపుతున్నాయి.
- వెండితో చేసిన విద్దాంక నాణేలు మారకపు ద్రవ్యంగా ఉండేవి. వీటి మీద నెమలి, కొండ, నెలవంక మొదలైన చిత్రాలు ఉండేవి. ఇవి పన్నులు వసూలు చేయడానికి, ఉద్యోగుల జీతాలను చెల్లించడానికి ఉపయోగపడి ఉంటాయి. అంతే కాకుండా నాణేల విలువ ఒకే రకంగా ఉండటం చేత విశాలమైన ప్రాంతంలో వ్యాపార లావాదేవీలు జరగడానికి ఇవి దోహద పడ్డాయని చెప్పవచ్చు.
- అశోకుడి రువాండే శిలాశాసనంలో పన్ను మొత్తం గురించి ప్రస్తావన ఉన్నది. లుంబిని గ్రామం బుద్ధుని జన్మస్థలం కావడం వల్ల ఆ గ్రామానికి అశోకుడు అన్ని పన్నుల నుంచి మినహాయింపు ఇచ్చాడని పంటలో కేవలం 1/8వ వంతును మాత్రమే పన్నుగా చెల్లించాలని ఈ శాసనం తెలుపుతున్నది. (బలి అనే పన్నును రద్దు చేసి కేవలం కొంత భాగా అనే పన్నును ఉంచాడు)
- చంద్ర గుప్త మౌర్యుల సామంతుడైన పుష్య గుప్తుడు అనే వైశ్య గవర్నర్ గుజరాత్‌లోని గిర్నార్ వద్ద సుదర్శన సరస్సును తవ్వించినట్లు, ఆనకట్ట నిర్మించినట్లు రుద్రదాముని జునాగఢ్ శాసనాల వల్ల తెలుస్తున్నది.
- జనాభా అధికమైన ప్రాంతాల నుంచి శూద్ర సమూహాలను మరోచోటికి తరలించి కొత్త నివాసాలు ఏర్పరిచే పద్ధతి కౌటిల్యుని అర్థశాస్త్రంలో ఉన్నది.
- పంటపొలానికి రాజే యజమాని అని మెగస్తనీస్ చెప్పిన విషయం వివాదాస్పదమైనది. రాజు భూమికి రక్షకుడే గాని యజమాని కాదు అని మౌర్యుల పాలనలో ఉన్నట్లు తెలుస్తున్నది.
- మౌర్యుల కాలంలో భూ యాజమాన్యాలు 5రకాలుగా ఉండేవి. వీటికి రాజు, ప్రభుత్వం, భూస్వాములు, సమష్టి యాజమాన్యం. వాస్తవ వ్యవసాయదారుడు.
- రైతులందరూ శూద్రులే. గ్రీకు, రోమన్లలో బానిసలు చేసే పనిని భారతదేశంలో శూద్రులు చేశారు.
- అగ్రవర్ణాల వారికి శూద్రులు ఉమ్మడి ఆస్తిగా ఉండి, ఇంటి పనివారిగా వ్యవసాయ కూలీలుగా, వృత్తి పనివారిగా, బానిసలుగా పనిచేసేవారు.
- జాతక కథనంలో తెలిపిన ప్రస్తావనలను బట్టి గహపతి గ్రామ భోజకులని, కొన్ని ప్రాంతాల్లో గ్రామాలను అభివృద్ధి చేసే తరగతికి చెందిన వారని తెలుస్తున్నది. వీరు రైతులకు, వర్తకులకు మూలధనం సమకూర్చే గ్రామాలను అభివృద్ధి చేశారు. పాళీ సాహిత్యంలో ఎక్కువగా కనిపించే గ్రామ భోజక భూమి యజమానిగా చెప్పవచ్చు.
- శతపథ బ్రాహ్మణంలోని విశ్వకర్మ అనేరాజు కథను బట్టి మొదట్లో రాజు భూమికి యజమాని కాదని తెలుస్తుంది. తర్వాత న్యాయ శాస్త్రాలు రాజే భూమికి యజమాని అని స్పష్టం చేశాయి. కానీ రాజు సొంత భూములకు ప్రభుత్వ భూములకు తేడా ఉంది.

## సామాజిక పరిస్థితులు

- నాటి సమాజంలో వర్ణ వ్యవస్థ బలపడింది. ప్రధానంగా అర్థశాస్త్రం వర్ణ వ్యవస్థను గురించి తెలుపుతుంది. వర్ణాల మధ్య వృత్తి మార్పిడి జరగరాదని అర్థశాస్త్రం నిషేధాన్ని విధించింది. అయితే మెగస్తనీస్ భారతదేశంలో కింది కులాల వారున్నట్లు రాశాడు.
  1) బ్రాహ్మణులు
  2) వ్యవసాయదారులు
  3) పశుపాలకులు
  4) వృత్తిపనివారు
  5) సైనికులు
  6) అపేక్షకులు లేదా ఉద్యోగులు
- సమాజంలో బహుభార్యత్వం పెరిగింది. కన్యలను కొనడం, అమ్మడం ఉండేది. కాబట్టి స్త్రీ స్వాతంత్ర్యం తగ్గిందని చెప్పవచ్చు. సతీసహగమనంత కూడా ఆచరణలో ఉండేది.
- వేశ్యవృత్తికి ప్రభుత్వం ఆమోదం లభించింది. వీరి ఆదాయంలో కొంత భాగం ప్రభుత్వానికి ముట్టజెప్పేవారు. స్త్రీలను గూఢచారిణులుగా కూడా నియమించారని అర్థశాస్త్రం తెలుపుతుంది.

## మత పరిస్థితులు

- మౌర్యులు జైన, అజీవక, బౌద్ధమతాలను ఎక్కువగా ఆదరించారు. వైదిక మతం పట్ల ఆదరణ తగ్గింది.
- చంద్రగుప్త మౌర్యుడు జైన మతాన్ని, బింబిసారుడు అజీవక మతాన్ని, అశోకుడు బౌద్ధ మతాన్ని, దశరథుడు అజీవక మతమైన సంప్రతి జైన మతాన్ని పాటించారు.
- అశోకుడి కాలంలో బౌద్ధమతం ముమ్మరంగా ప్రచారం చేయడం వల్ల దేశ వ్యాప్తమైంది. అయితే బ్రాహ్మణ మతం అశోకుని మరణానంతరం విజృంభించింది.
- జైన, బౌద్ధమతాల ప్రభావం వల్ల భక్తి ప్రధానంగా గల శైవ, వైష్ణవ మతాలు ప్రచారమయ్యాయి. కృష్ణుడు బోధించిన బోధనలు వైష్ణవ మతానికి మూలమైన వాసుదేవ మతంగా రూపొందింది. వాసుదేవ మతానికి మధురానగరం కేంద్రమైంది.

## భాషా సారస్వతాలు

- మౌర్య యుగంలో ప్రాకృతం విస్తృతంగా, సంస్కృతం కొంత వరకు అభివృద్ధి చెందాయి. ప్రాకృతం రాజభాష. అశోకుని శాసనాలు ప్రాకృతంలోనే లిఖించి ఉన్నాయి. ఎక్కువ మంది ప్రజలు శాసనాలు చదవడానికి వీలు కల్పించడానికి ప్రాకృత భాషలోనే శాసనాలు రాశారు.
- ప్రముఖ విద్యా కేంద్రాలుగా తక్షశిల, వారణాసి వెలిశాయి. అయితే తక్షశిల సుప్రసిద్ధ విశ్వవిద్యాలయంగా వెలిసింది. ఇక్కడ తర్కం, వ్యాకరణ, రాజనీతి మొదలైన అంశాలు బోధించేవారు.
- ఈ కాలంలో బ్రాహ్మీలిపి ప్రచారంలోకి వచ్చింది. బౌద్ధ వాఙ్మయం చాలా వరకు ప్రాకృత భాషలోనే ఉంది.
- వైదిక ప్రవర్తనను బోధించి, బౌద్ధ జాతక కథలు ప్రజల్లో బాగా ప్రాచుర్యాన్ని పొందాయి.
- పంతంజలి మహాభాష్యం గొప్ప వ్యాకరణ, సాహిత్య గ్రంథం.
- కౌటిల్యుని అర్థశాస్త్రం, భద్రబాహుని కల్ప సూత్రం అభిధమ్మ పిఠికం, కథావత్తు ఈ నాటి ముఖ్య గ్రంథాలు.

## వాస్తు శిల్ప కళ

- సింధూ నాగరికత పతనానంతరం నుంచి అశోక చక్రవర్తి కాలం వరకు భారతీయ శిల్ప చరిత్రలో పెద్ద శూన్యం ఏర్పడింది.
- అంతకు ముందు వాస్తు శిల్పాలకు ప్రధాన మాధ్యమంగా ఉన్న దారువు స్థానంలో శిల వచ్చింది. అంటే భారతీయ వాస్తు చరిత్రలో కలపకు బదులు శిలను ఉపయోగించడం మౌర్య యుగంలో అరంభమైంది.
- చారిత్రక యుగానికి చెందిన తొలి కట్టడాలు మౌర్యుల కాలం నుంచి ప్రారంభమయ్యాయి.
- చంద్రగుప్తుని కాలంలో ఎక్కువగా కర్రతో చేసిన కట్టడాలు ఉండేవి. అవి త్వరలోనే అంతరించి పోయాయి. కారణం గంగా - మైదాన ప్రాంతంలో వరదలు ఎక్కువగా రావడం, తేమతో కూడిన ప్రదేశాలు ఎక్కువగా ఉండటం. ఈ సమస్యను ఎదుర్కోవడానికి అశోకుడి పాలన నుంచి రాతి కట్టడాలు నిర్మించి, కాలగమనానికి ఎదురీది, మౌర్య వాస్తుకళకు ప్రత్యక్ష సాక్ష్యాలుగా నిలిచాయి.
- ఈ కాలంలో శిలలను ఎక్కువగా ఉపయోగించే అఖమెనిడ్ పర్షియాతో సంబంధాలు ఏర్పడటం వల్ల అశోకుని కాలంలో కొయ్య స్థానంలో రాతిని ఉపయోగించడానికి ఒక కారణంగా చెప్పవచ్చు.
- అశోక స్తంభాలను రెండు రకాల రాగితో చేశారు. మధుర నుంచి వచ్చిన ఎర్రచుక్కలున్న తెల్లని రాయి, బెనారస్ దగ్గర చునార్ నుంచి నున్నటి నలుపు చుక్కలున్న ఇసుక రాతితో తయారు చేశారు. మౌర్యులు కళకు, శిల్పానికి గొప్పగా దోహదం చేసి రాతి కట్టడాలను విస్తృతంగా పరిచయం చేశారు.
- మౌర్యుల నాటి శిల్పులు, బిక్షువులు నివసించడం కోసం రాతి గుహలను తొలచడం కూడా ప్రారంభించారు. గయకు దగ్గర ఉన్న బరాబార్ గుహలు ఇందుకు అత్యంత ప్రాచీనమైన ఉదాహరణ.
- ఈ గుహలను అశోకుడి మనుమడైన దశరథుడు నిర్మించాడు. ఈ కొండల్లో సుధామ, లోమరుషి అనే రెండు గుహలున్నాయి. అక్కడున్న వాస్తుకళ మీద కలప చిత్ర వాస్తు కళా ప్రభావం స్పష్టంగా కనబడుతుంది.
- రోపర్‌లో గుండ్రని ఊటబావులు మౌర్యుల కాలం నాటివే.

అశోకుడి కాలంలో 4 రకాల వాస్తు శిల్పాలు లభ్యమవుతున్నాయి. అవి

1) స్థూపాలు 2) స్తంభాలు
3) రాజభవనాలు 4) గుహాలయాలు

- సాధారణంగా బుద్ధుడు లేదా ప్రసిద్ధ బౌద్ధ గురువుల పవిత్ర అస్థికల స్మృతిగా స్థూపాలు నిర్మించబడ్డాయి.
- స్తంభాలు, గుహాలయాలు బౌద్ధ సన్యాసుల నివాసాలకు, బౌద్ధమత ప్రచారానికి నిలయాలుగా మారాయి. దీన్ని బట్టి నాటి వాస్తు కళ విశేషాలు ముఖ్యంగా బౌద్ధమతానికి సంబంధించినవి అని తెలుస్తుంది.
- అశోకుడు 84వేల స్థూపాలను నిర్మించాడని బౌద్ధ గ్రంథాలు తెలుపుతున్నాయి. వీటిలో సాంచీ, బార్హుత్ స్థూపాలు ప్రసిద్ధి చెందినవి. సారనాథ్ సుప్రసిద్ధ ఏకశిలా స్తంబం.
- సాంచీ స్థూపం గొప్పకట్టడం. ఇది మధ్యప్రదేశ్‌లోని భోపాల్ దగ్గర ఉంది. దీని చుట్టుకొలత 36 మీ., ఎత్తు 23 మీ. ఉన్నది.
- బౌద్ధ పుణ్యక్షేత్రాల్లో జనసమ్మర్ధ ప్రాంతాల్లో అశోకుడు ఏకశిలా స్తంభాలను నిర్మించాడు. ఇవి నాటి నిర్మాణ ప్రతిభకు తార్కాణాలు. వీటి ఎత్తు సుమారు 50 అడుగుల వరకు ఉంటుంది. ఇవి అధోముఖ పద్మం, దానిపై ఫలకం, ఫలకంమీద సింహం లేదా వృషభ శిల్పం అనే మూడు భాగాలతో స్తంభ కీరిటాన్ని ఏర్పాటు చేశారు.
- సారనాథ్ (ఉత్తరప్రదేశ్) సింహ కిరీటం భారతీయ శిల్పకళా ప్రగతికి మచ్చుతునక.
- స్తంభ శిలా వేదికల మీద నెమళ్ల బొమ్మలు, మౌర్యుల పుట్టుకకు సంబంధించిన కథలను సూచిస్తాయి.
- తీస్రా, మీరట్‌లోని స్తంభాలను ఫిరోజ్ తుగ్లక్ కాలంలో ఢిల్లీకి తరలించారు. నేటికీ ఫిరోజ్ షా కోటల్లో ఉన్న ఈ స్తంభాలు లోహంతో నిర్మించినట్లు భ్రమను కొల్పుతాయి.
- అశోకుని బౌద్ధ ధర్మానురక్తి భారతీయ కళా వికాసానికి తోడ్పడింది.
- ఇనుమును పెద్ద మొత్తంలో విద్దాంక నాణేలను, ఎన్.బి.పి.డబ్ల్యూ (Narthern Black Polished Ware) అని పిలిచే అందమైన పాత్రలను, కాల్చిన ఇటుకలను, వర్తులాకారంలో ఉన్న బావులను విస్తృతంగా ఉపయోగించడం మీద గంగా-మైదానంలోని భౌతిక సంస్కృతి ఆధారపడి ఉండేది. ఇలా గంగా-మైదానంలోని భౌతిక సంస్కృతి మౌర్య సామ్రాజ్యంలోని సుదూర ప్రాంతాలకు కూడా వ్యాపించింది.
- దక్షిణ బీహార్‌లో ఇనుము సులభంగా లభిస్తుండటంతో ప్రజలు ఇనుప పనిముట్లను ఉపయోగించడం క్రమ క్రమంగా అధికం కాసాగింది. రంధ్రం ఉన్న గొడ్డళ్లు, కొడవళ్లు, నాగలి కర్రులు ఈ కాలంలో ఎక్కువగా ఉపయోగించారు. ఇనుప ఆయుధాలు రాజ్యం గుత్త ఆస్తి అయిన ఇనుప పనిముట్లను అన్ని వర్గాలవారు ఉపయోగించడానికి వీలుండేది. వాటిని తయారు చేయడం గంగా మైదానం నుంచి మౌర్య సామ్రాజ్యంలో సుదూర ప్రాంతాలకు వ్యాపించింది.
- సింధూ నాగరికత అనంతరం మౌర్య సామ్రాజ్యంలోనే మొట్టమొదటిసారిగా కాల్చిన ఇటుకలను ఉపయోగించడం ప్రారంభమైంది.

### ప్రాక్టీస్ బిట్స్

1. మౌర్యుల కాలంలో సీతాధ్యక్ష అని ఎవరిని పిలిచేవారు? (బి)
   ఎ) పన్ను వసూలు అధికారి
   బి) రాజ్య వ్యవసాయ క్షేత్రాలను పర్యవేక్షించే అధికారి
   సి) సైన్యానికి జీతాలు చెల్లించే అధికారి
   డి) పై ఎవరూ కాదు
2. కింది వాటిలో సరైనవి గుర్తించండి? (డి)
   ఎ) పన్నులు నిర్ణయించే అత్యున్నతాధికారి -సమాహర్త
   బి) పన్ను ధనాన్ని ఖజానాలో భద్రపరిచే అధికారి - సన్నిధాత
   సి) ఎ, బి సరైనవి కావు
   డి) ఎ, బి రెండూ సరైనవి
3. శక రాజు రుద్రదాముని జునాగఢ్ శాసనంలో ఏ మౌర్య చక్రవర్తి ప్రస్తావన కనిపిస్తుంది?
   ఎ) చంద్రగుప్త మౌర్యుడు
   బి) బిందు సారుడు
   సి) అశోకుడు డి) దశరథుడు
4. అజీవక మతస్తుల కోసం 'బరాబార్' గుహలను నిర్మించిన మౌర్య చక్రవర్తి? (సి)
   ఎ) అశోకుడు బి) చంద్రగుప్తమౌర్యుడు
   సి) దశరథుడు డి) సంప్రతి
6. కింది వాటిలో సరైనవి ఏవి? (డి)
   ఎ) చంద్రగుప్త మౌర్యుడు జైనమతాన్ని ఆదరించాడు
   బి) బిందుసారుడు అజీవక మతాన్ని ఆదరించాడు
   సి) అశోకుడు బౌద్ధమతాన్ని ఆదరించాడు
   డి) పైవన్నీ సరైనవే

**సాసాల మల్లికార్జున్**
అసిస్టెంట్ ప్రొఫెసర్
ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, కోరుట్ల

